# వేగవంతంగా ఓటరు స్లిప్పుల పంపిణీ

**జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి**



కలెక్టర్‌కు ఓటర్ స్లిప్పును అందజేస్తున్న బీఎల్‌వో

వికారాబాద్, నవంబర్ 18 : శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలతో పాటు, ప్రతి గ్రామంలో బీఎల్‌వోల ద్వారా ఓటరు సమాచార స్లిప్పులను అందజేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి నారాయణ రెడ్డి శనివారం తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్పులను అందజేస్తారన్నారు. స్లిప్పుల పంపిణీ వేగవంతంగా చేపట్టి ఈ నెల 22 వరకు పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు, ఈపిక్ కార్డుతో పాటు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి గుర్తింపుగా పోలింగ్ కేంద్రంలో చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఈనెల 30న నిర్వహించే ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ నారాయణరెడ్డికి ఓటర్ స్లిప్పును వీఎల్ఓ అందజేశారు.

**ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటర్‌కు అందాలి**

ఓటరు స్లిప్పు ప్రతి ఓటర్‌కు అందేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి బీఎల్‌వోలకు సూచించారు. ఈ నెల 30 న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా శనివారం వికారాబాద్ నియోజకవర్గం ద్యారం, పులుసుమామిడి, సిద్దులూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో ఓటర్ స్లిప్పులతోపాటు ఓటర్ గైడ్, సి-విజిల్ కరపత్రాలను తప్పనిసరిగా అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ముందు ఓటర్ స్లిప్పుతో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని ఓటర్లకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ స్లిప్పులు అందలేదనే ఫిర్యాదు రాకుండా జాగ్రత్తతో విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్ , ఫ్యాన్ , టాయిలెట్స్ తో పాటు నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, సెక్టోరల్ అధికారి అర్చన, బీఎల్‌వోలు ఉన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకొని పరిశీలించారు.

# కాంగ్రెస్‌లో చిచ్చు

**ప్రచార రథంపై స్థానం ఇవ్వకపోవడంతో సుజాత అలక**



రాష్ట్ర అధికార ప్రతినిధి కల్యసుజాతను బుజ్జగిస్తున్న కార్యకర్తలు

తాండూరు, నవంబర్ 19: తాండూరులో కాంగ్రెస్ నేతల వర్గపోరు మరోసారి తీవ్రస్థాయికి చేరుకుంది. శనివారం తాండూరులో నిర్వహించిన కాంగ్రెస్ ర్యాలీలో ప్రచార రథంపై కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వసుజాతకు స్థానం ఇవ్వకపోవడంతో అవమానం జరిగిందని అక్కడే ఉన్న నేతలపై ఫైర్ అయింది. కోపంతో మెదలో పార్టీ కండువాతీసి కారులో కూర్చున్నది. కొందరు మహిళా నేతలతో పాటు కార్యకర్తలు బుజ్జగించతో అయిష్టంగా ప్రచారంలో పాల్గొన్నది. ఇదిలా ఉండగా ఆమెతో పాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నేతలకు సరైన మర్యాద లేకపోవడంతో అవమానంగా భావిస్తున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్‌లోని ముఖ్య నేతలు త్వరలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతర్గతంగా ఉన్న వర్గపోరు ఇప్పుడు పార్టీలో చీలికలకు గురిచేశాయి. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటు బగ్గుమంటున్నారు. క్రమశిక్షణ ఉన్న బీఆర్ఎస్ పార్టీలో నేతలు ఏకతాటిపై ఉంటు తాండూరులో బీఆర్ఎస్ బలోపేతంకు కృషి చేస్తున్నారు. రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో ఎక్కడ వర్గాలు లేకుండా ఎవరి మధ్య విభేదాలు రాకుండా చక్కటి ప్రణాళికతో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు, ముఖ్య నేతలతో పాటు కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇప్పిస్తున్నారు. దీంతో 30 వేలకు పైగా మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి గెలుపు కనిపిస్తున్నది. మెందెన్నడూ లేని విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశారు. అదే విధంగా రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారు. దీనికి తోడు ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతంగా ఉండడంతో తాండూరులో గులాబీ పార్టీ గుబాళిస్తున్నది. కారు వేగంతో ప్రతిపక్ష పార్టీల నేతల్లో బయం కనిపిస్తున్నది. దీంతో బీఆర్ఎస్‌లోకి స్వచ్ఛందంగా వలసలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని కుల, మత సంఘాలు రోహిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు పలుకుతున్నాయి.

# ఐటీలో మనమే మేటి

**ఐటీ కారిడార్‌లో అభివృద్ధే నమూనా**

- శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో గెలుపుపై బీఆర్ఎస్ ధీమా
- గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రభుత్వ పనితీరుపై ఓటర్లు సంతృప్తి



సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అభివృద్ధిలో ఐటీ కారిడార్ అత్యంత కీలకమైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఐటీ కారిడార్‌లోని ప్రాంతాల పరిస్థితి ఏమవుతుందోనన్న ఆందోళన ఉండేది. అలాంటిది రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వచ్చిన ప్రభుత్వం ఐటీ రంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దాని ఫలితంగానే దేశ సిలికాన్ వ్యాలీగా ఉన్న బెంగళూరును మించిపోయేలా ఇక్కడ ఐటీ రంగం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఐటీ కారిడార్ అంటే కేవలం ఐటీ కంపెనీల కార్యాలయాలే కాదు. పక్క పక్కనే నివాస భవనాలు, ఐటీ కంపెనీల కార్యాలయాలు. వాక్ టు వర్క్స్ అనే భావనతో రూపుదిద్దుకున్న ఐటీ సెజ్‌లు హైదరాబాద్ అభివృద్ధికి నమూనాలుగా మారాయి. ఐటీ కారిడార్‌లో నివాసం ఉంటున్న ప్రజలు ఊహించిన రీతిలో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం తీసుకున్న ప్రణాళికలే ప్రధాన కారణం. ఇవే ఇప్పుడు ఐటీ కారిడార్‌లోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపునకు దోహదం చేసేలా ఉంటున్నాయి. ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ అభ్యర్థులకు స్థానికుల నుంచి వస్తున్న సానుకూల స్పందనే ఇందుకు నిదర్శనంగా పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లోని కంపెనీల్లో పని చేస్తున్న ఐటీ ఉద్యోగుల నివాసాలు ఇదే ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ పనితీరు పట్ల ఐటీ ఉద్యోగులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

**గేటెడ్ కమ్యూనిటీల్లో అభివృద్ధిపైనే ప్రధానంగా చర్చ**

ప్రస్తుతం నగరంలోనే కాకుండా రాష్ట్రమంతా ఎన్నికల వాతావరణమే ఉండటంతో ప్రజలు గెలుపు ఓటములపైనే ప్రధానంగా చర్చించుకుంటున్నారు. ఏ పార్టీ ఏం చేసింది? ఏ అభ్యర్థి ఎలాంటి వారు? సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న అభ్యర్థి ఎలాంటి అభివృద్ధి చేశాడనే అంశాలను బస్తీలు, కాలనీల్లోనే కాకుండా ఐటీ కారిడార్‌లో అత్యధికంగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లోనూ వీటి పైనే చర్చించుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా కేవలం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9వేల కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరికెపూడి గాంధీ పేర్కొంటున్నారు. అదే విధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రాంతాలైన నార్సింగి, మణికొండ, కోకాపేట, గండిపేట ప్రాంతాల్లో ఐటీ కంపెనీలతో పాటు నివాస ప్రాంతాలు భారీ సంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో గత తొమ్మిదిన్నరేండ్లలో గణనీయమైన అభివృద్ధి జరగడం, ఈ ప్రాంత రూపురేఖలు ఒక్కసారిగా మారిపోవడంతో స్థానిక ప్రజలు ప్రభుత్వ పనితీరు వల్లే ఇదంతా సాధ్యమైందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు అడకపోయినా ఐటీ కారిడార్‌లో పదుల సంఖ్యలో లింకు రోడ్ల అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఐటీ కారిడార్‌లోని నివాస ప్రాంతాల్లోనూ మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు వాటిని సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చిన విషయాన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసం ఉంటున్న వారు చర్చించుకుంటున్నారు. ఇలా రెండు నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి ఊహించని రీతిలో జరగడంతో ప్రభుత్వం పట్ల అత్యంత సానుకూలతను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తేనే మరింతగా అభివృద్ధి జరుగుతుందనే అంశంపైనే కాలనీ సంక్షేమ సంఘాలు తమ అంతర్గత సమావేశాల్లోనూ చర్చించుకుంటూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్నారు.

# కొత్త కాలనీలు మార్గాల్లో సిటీ బస్సు సర్వీసులు

- అన్ని మార్గాల నుంచి ఐటీ కారిడార్, సికింద్రాబాద్‌కు బస్సులు
- ఆర్టీసీ అందిస్తున్న సర్వీసులతో ఫిదా అవుతున్న నగర ప్రయాణికులు
- విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారాలకు అనుకూలంగా మారిన సిటీ బస్సు సర్వీసులు



సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : నగరంలో కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీ వాసులకు అనుకూలంగా ఆర్టీసీ సిటీ బస్సులు నడుపనున్నది. ముఖ్యంగా అవుటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా కొత్తగా వందల కొద్దీ కాలనీలు ఏర్పాటయ్యాయి. దీంతో ఆ కాలనీలకు బస్సుల కనెక్టివిటీని పెంచాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని మేజర్ కాలనీల్లో సిటీ బస్సుల అనుసంధానం పెరిగింది. త్వరలోనే మిగిలిన కాలనీల వారికి కూడా అందుబాటులోకి సిటీ సర్వీసులను తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఆర్టీసీ అధికారులు రూట్ సర్వే కూడా చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా కాలనీలకు రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. ఉదాహరణకు ఉప్పల్ నుంచి మెహిదీపట్నం వరకు మాత్రమే నడుస్తున్న సిటీ బస్సు సర్వీసులను మెహిదీపట్నం నుంచి చెంగిచర్ల వరకు పొడిగించారు. ర్యాక్‌వేవ్ నుంచి కూకట్‌పల్లి వరకు నడుస్తున్న సర్వీసును బాచుపల్లి వరకు పొడిగించారు. ఇప్పటికే నగరంలోని అనేక కాలనీల నుంచి మెట్రో స్టేషన్లకు సిటీ బస్సులను అనుసంధానించడం వల్ల నగర ప్రయాణికులకు ప్రయాణం సులువైంది. పైగా తక్కువ ఖర్చులోనే ఎక్కువ దూరం ప్రయాణించేలా ప్రజా రవాణా మెరుగుపడింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రయాణికులు ఫిదా అవుతున్నారు. ఆర్టీసీ సర్వీసులను అన్ని మార్గాలకు విస్తరించడం వల్ల ప్రైవేటు ట్రాన్స్‌పోర్టును వీడి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును అధిక సంఖ్యలో ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలోని అన్ని ప్రధాన రూట్లలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో ఫుల్‌గా నిండటమే అందుకు నిదర్శనం అని చెప్పవచ్చు. అయితే ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు అనుకూలంగా మారుతున్నాయని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తున్నది.

## కులకచర్ల, చౌడాపూర్ మండలాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరు

కులకచర్ల, నవంబర్ 18 : వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు కులకచర్ల, చౌడాపూర్ మండలాల వ్యవసాయాధికారి వీరస్వామి తెలిపారు. కులకచర్ల మండలంలో 9 కేంద్రాలు, చౌడాపూర్ మండలానికి 8 కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. కులకచర్ల మండలంలో బండవెల్కిచర్ల (పీఏసీఎస్), కులకచర్ల-1కు(డీసీఎంఎస్), కుస్మసముద్రం (ఎఫ్‌పీవో), సాల్వీడ్ (ఐకేపీ), ముజాహిద్‌పూర్ (పీఏసీఎస్), అంతారం (పీఏసీఎస్), తిర్మలాపూర్ (పీఏసీఎస్), ముజాహిద్‌పూర్ (ఐకేపీ)కు కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. చౌడాపూర్ మండలంలో చాకల్‌పల్లి (పీఏసీఎస్), చౌడాపూర్(పీఏసీఎస్), మ్యన్‌కల్వ (పీఏసీఎస్), మల్కాపూర్(పీఏసీఎస్), మరికల్ (పీఏసీఎస్), కొత్తపల్లి(ఐకేపీ), అడవివెంకటాపూర్ (పీఏసీఎస్), వీరాపూర్(పీఏసీఎస్)కు కేటాయించినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాలు పరిసర గ్రామాల రైతులకు అందుబాటులో కేటాయించారన్నారు.